క్లుప్తంగా

ఎమ్మెల్యేకు పరామర్శ



మహిపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వివేకానంద, మైనంపల్లి

పటాన్‌చెరు: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పెద్ద కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణం బాధాకరమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గురువారం ఎమ్మెల్యేను పరామర్శించారు.

తండాలను పంచాయతీలుగా చేయాలి



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తండావాసులు

నారాయణఖేడ్: మండలంలోని గౌరారం, మియాపూర్ తండాలను కలిపి గౌరారం తండా కేంద్రంగా కొత్త గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయా తండాల వాసులు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపారు. కర్నాటకలోని గుండం సెట్ తండాకు చెందిన రాథోడ్ వాలు గత నెల 31వ తేదీన బైక్‌పై జహీరాబాద్ పట్టణానికి వెళ్తుండగా.. హోతి(బి) వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మందుబాబులకు జరిమానా


పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా విధించింది. ఈ సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ, బుధవారంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 25 మందిని పట్టుకున్నట్టు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 24 మందికి ఒక్కొక్కరికీ రూ. 2 వేల చొప్పున జరిమాన విధించగా మరో వ్యక్తికి రూ. 3 వేలు జరిమాన విధించినట్టు చెప్పారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 18 మంది వాహనదారులకు కూకట్‌పల్లి కోర్టు జరిమానా విధించింది. వీరికి కోర్టు రూ. 48 వేల జరిమానా విధించింది.

ఖేడ్‌కు ప్రత్యేక నిధులు కేటాయించండి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తూ ప్రస్తుత అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వం ప్రకటించాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్ రాథోడ్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభా అధికంగా ఉండటంతో పాటు జిల్లాలో కెల్లా తండాలు ఇక్కడే ఎక్కువ అని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్ రాథోడ్, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్, కార్యదర్శి వినోద్ రాథోడ్, నాయకులు ప్రతాప్, ప్రేమ్, రాజు, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఆందోల్ నియోజకవర్గంలోని చౌటకూరు మండలం చెక్రియాల్ గ్రామం నుంచి 12 టీఆర్‌ఎస్ కార్యకర్తలు మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి ఏమీ చేయలేదని.. దామోదర్ రాజనర్సింహ చేసిన అభివృద్ధి తప్ప బీఆర్‌ఎస్ చేసిందేమి లేదన్నారు. చెక్రియాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు రా జశేఖర్ ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. కార్యక్రమంలో చౌటకూరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నత్తి దశరథ్, నాయకులు మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ పాండు, నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రభు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి టౌన్ : కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, నాయకులు



సదాశివపేట పట్టణంలో..



నారాయణఖేడ్‌లో..

మాఫీ.. హ్యాపీ

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

రైతులకు సీఎం కేసీఆర్ రుణమాఫీ ప్రకటించడంపై రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లావ్యాప్తంగా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.



కంగ్టి: తడ్కల్‌లో..



రాయికోడ్‌లో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

మెరుగైన సేవలతోనే గుర్తింపు

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం సంగారెడ్డిలో పేద ప్రజలకు హోప్స్ న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి మెరుగైన సేవలు అందిస్తుందని ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పేర్కొన్నారు. గురువారం ఆస్పత్రి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నూతనంగా సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ మిషన్లను ప్రారంభించారు. ఈసందర్భంగా అతి కొద్ది కాలంలోనే ప్రజల మన్ననలు చూరగొన్న ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. రాబోయే రోజుల్లో పేద విద్యార్థుల కోసం మరిన్ని వైద్య సేవలు అందించాలని కోరారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కష్ణమూర్తి, నిర్వాహకులు డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. నెల రోజులపాటు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర టెస్టులను ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు చక్రపాణి, డాక్టర్ అనిల్ కుమార్, టిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



ఝరాసంగం: విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): జాతీయ నులి పురుగు నిర్మూలన దినోత్సవాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఝరాసంగం కేజీబీవీ విద్యాలయంలో మండల వైద్యాధికారి రమ్య, ఎంపీటీసీ సభ్యురాలు రజనిప్రియ సంతోష్‌కుమార్ పాటిల్, ప్రత్యేకాధికారి నిర్మల సిబ్బందితో కలిసి విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు తప్పనిసరిగా నులి పురుగు నివారణ మాత్రలు వేసుకోవాలని సూచించారు.

పటాన్‌చెరు టౌన్: నులి పురుగులతో పిల్లలకు అస్వస్థత, వివిధ రకాల వ్యాధులు ప్రబలకుండా పటాన్‌చెరు జేపీ లయన్స్ క్లబ్, శ్రీ సాయి తేజ విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు లయన్స్ క్లబ్ డైరెక్టర్ అమరేందర్, మతిన్, ధన్ రాజు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రారెడ్డి జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణ పాల్గొన్నారు.

నారాయణఖేడ్: మండల కేంద్రమైన నిజాంపేట్‌లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, బాలికల పాఠశాలల్లో గురువారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుశీల్‌కుమార్, సర్పంచ్ జగదీశ్వరాచారి, ఉప సర్పంచ్ రాంచందర్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలపై హర్షం

కొండాపూర్(సంగారెడ్డి): ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చైర్మన్, సభ్యులను నియమించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం అన్నారు. గురువారం సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ ప్రభుత్వం దళిత, గిరిజనుల పట్ల వివక్ష చూపుతుందనడానికి హైకోర్టు ఆదేశాలే నిదర్శనమన్నారు.

అర్హులకు దళితబంధు కేటాయించాలి

జిన్నారం(పటాన్‌చెరు): సొంత పార్టీ నేతలకు మాత్రమే దళితబంధు పథకాన్ని వర్తింపజేసేలా స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారని దళితులు ఆరోపించారు. జిన్నారం మండలంలోని జంగంపేట గ్రామంలో అర్హులైన, నిరుపేద దళితులకు దళితబంధు పథకాన్ని వర్తింప జేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళితులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు.

జహీరాబాద్ అభివృద్ధికి మంత్రి కృషి

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతం గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధిని సాధించిందంటే మంత్రి హరీశ్‌రావు పుణ్యమే అని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. గురువారం జహీరాబాద్‌లో డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌రావు పవార్, మొగుడంపల్లి జెడ్పీటీసీ అరుణ మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్‌గుప్తా మాట్లాడుతూ.. మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్న రాములును పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి అనేక కారణాలున్నాయన్నారు. సస్పెండ్ చేసినందున మంత్రి హరీశ్‌రావుపై విమర్శలకు దిగడం ఆయన స్థాయికి తగదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎవరి అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తే పార్టీ శ్రేణులన్నీ గెలుపు కోసం పనిచేస్తాయన్నారు. తెలంగాణ ఉద్యమంలో పని చేసిన అనేక మంది నాయకులు పదవులు రాకున్నా పార్టీ శేయస్సు కోసం పనిచేస్తున్నారనే విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో కేతకీ మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్, సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.రవికిరణ్, ఎం.డి.యాకూబ్, ఆర్.సుభాష్, నర్సింహారెడ్డి, తులసీదాస్‌గుప్తా, గోవర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, అప్సర్, రాజారమేష్, మధు, సంజయ్, మనోజ్, సాజీద్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

సదాశివపేట(సంగారెడ్డి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిదని హాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం సదాశివపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 15 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు తొంట యాదమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రైతుబంధు మండల అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు సంతోష్‌గౌడ్, మాధవరెడ్డి, ఆహ్మద్, సునీత, సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, నరేష్‌గౌడ్, శేఖర్, కుమార్, సిద్దన్న, లావుద్దిన్, నగేష్, నాయకులు పాల్గొన్నారు.

నీటి ఇబ్బంది లేకుండా చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలో నీటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నామని బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో బోర్లను గురువారం ప్రారంభించారు.

నష్టపోయిన వారిని ఆదుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోయిన వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ సూచించారు. ఆయా గ్రామాల్లో వర్షం కారణంగా ఇళ్లు కూలిపోయిన పలువురు నిరుపేదలకు కాటా శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో గురువారం ఆర్థికసాయం అందించారు.

‘బీజేపీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేద్దాం’

జహీరాబాద్: బీజేపీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేసి వచ్చే ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంపై జెండా ఎగరేద్దామని డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బీజేపీపై రోజు రోజుకు ఆదరణ చూపుతున్నారన్నారు. ఇప్పటి నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచందర్ రాజనర్సింహా, జిల్లా అధికార ప్రతినిధి సుధీర్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అశోక్

నారాయణఖేడ్: గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో దశల వారీ పోరాటంలో భాగంగా ఈనెల 5న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్టు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్ తెలిపారు. నారాయణఖేడ్‌లో గురువారం గురుకుల టీచర్లతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు మేనేజ్‌మెంట్లలో కొనసాగుతున్న గురుకుల ఉపాధ్యాయులందరికీ పారిటీ స్కేల్ వర్తింపజేయాలని.. అన్ని సొసైటీల్లో ఒకే విధమైన పాలన అమలు చేయాలని కోరారు. బదిలీలు, పదోన్నతుల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చే యాలని.. పనిభారం, మానసిక ఒత్తిడి తగ్గించడమే కాకుండా కేర్ టేకర్, డిప్యూటీ వార్డెన్‌లను ప్రత్యేకంగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు హరిసింగ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ జూనియర్ కళాశాల జోగిపేటలో ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్టు జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలను ప్రిన్సిపాల్ రజితతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ ఇంటర్ ఒక వరం లాంటిదని అన్నారు. ఈనెల 10వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ విఠల్, అధ్యాపకులు శ్రీనివాస్, అనిత, బాలరాజ్ పాల్గొన్నారు.



భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

గ్రూప్-2 వాయిదా వేసేలా చూడండి

నారాయణఖేడ్: గ్రూప్– 2, జూనియర్ లైన్‌మెన్ పరీక్షలు వరుసగా ఉన్నందున ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో గ్రూప్–2 పరీక్షను వాయిదా వేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో వివిధ జిల్లాలకు చెందిన నిరుద్యోగులు సీఎల్పీ నాయకుడు బట్టి విక్రమార్కను కోరారు. హైదరాబాద్‌లో గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు.

పేదల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

రామచంద్రాపురం(పటాన్ చెరు): పేదల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రామచంద్రపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. రుంవారం పట్టణంలోని వార్డు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

ఆన్‌లైన్ మోసం.. డబ్బులు మాయం

పటాన్‌చెరుటౌన్: ఆన్‌లైన్ జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగిని రూ. 46 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని సాయి అనురాగ్ కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగినికి మే 15వ తేదీన పార్ట్ టైం జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగిని తన వివరాలు నమోదు చేశారు. ఉద్యోగిని ముందుగా రూ. 2 వేలు చెల్లించింది. ఇలా పలు దఫాలుగా మొత్తం రూ. 46 లక్షలు చెల్లించింది. సైబర్ నేరగాళ్లు ఉద్యోగినితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగిని చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నారాయణరెడ్డి కాలనీలో..

అమీన్‌పూర్ పరిధిలోని నారాయణరెడ్డి కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి బ్యాంకు నుంచి మెసేజ్ అంటూ ఓ ఫైల్ ఫార్మాట్‌ను జూలై 29 తేదీన పంపించారు. దీంతో బ్యాంక్ అకౌంట్ వారి ఆధీనంలోకి వెళ్లిపోయింది. అయితే బాధితుడు ఇటీవలే పర్సనల్ లోన్ రూ. 4 లక్షల 13 వేలు తీసుకోగా అందులో నుంచి రెండు లక్షల 34 వేలు వాడుకున్నాడు. కాగా మిగిలిన రూ. లక్షా 79 వేలు అతడి బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు కాజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **12 మందికి కోవిడ్ పరీక్షలు**

పటాన్‌చెరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదని చెప్పారు.

◆ **రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి**

వట్‌పల్లి(అందోల్): రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 5వ తేదీ వరకు గడువు ఉందని గురువారం అందోలు మండల వ్యవసాయశాఖ అధికారి విజయరత్న తెలిపారు. రైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల బీమాను వర్తింపజేసేందుకు ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని అమలు చేస్తుందన్నారు.

◆ **చింతా ప్రభాకర్‌కు కృతజ్ఞతలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎన్కేపల్లిలోని ఈద్గా అభివృద్ధికి రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ రూ. 5 లక్షల నిధులు మంజూరు చేయడంపై గ్రామానికి చెందిన మైనార్టీలు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గురువారం అయన నివాసంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాములు ఆధ్వర్యంలో మైనార్టీలు చింతా ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, అహ్మద్, ఖదీర్, అబ్దుల్, మైనోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

◆ **భక్తితోనే మానసిక ప్రశాంతత**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భక్తి భావనతోనే మానసిక ప్రశాంతత నెలకొంటుందని డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం అన్నారు. గురువారం మండల పరిధిలోని తంగడపల్లి తండాలోని భవానీ మాత ఆలయంలో భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. భక్తితోనే మనసు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని అంబేద్కర్, బసవేశ్వర విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొండాపూర్ ఎంపీపీ మనోజ్‌రెడ్డి, వైఎస్‌ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ప్రేమానందం, తదితరులు పాల్గొన్నారు.

◆ **అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి**

రాయికోడ్(అందోల్): మండలంలోని కూసునూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధిక, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్థిక సాయం**

ఝరాసంగం(జహీరాబాద్): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వారి పిల్లలను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఢిల్లీ వసంత్, నాయకులు పరామర్శించారు. గురువారం మండల పరిధిలోని బిడెకన్నెలో చిన్నారులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

◆ **భవిత కేంద్రం ప్రారంభం**

జహీరాబాద్ టౌన్: ప్రత్యేక అవసరాలు (దివ్యాంగులు) కలిగిన పిల్లలకు విశిష్ట సేవలు అందించేందుకు మొగుడంపల్లి మండలంలోని అసంద్‌గంజ్‌లో భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఈ కేంద్రాన్ని సర్పంచ్ ఓంకార్, ఎంపీటీసీ రాంచందర్, ఎంఈఓ బస్వరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం జగదీశ్వర్, ఎస్ఎంసీ చైర్మన్ శరణప్ప, తదితరులు పాల్గొన్నారు.

◆ **జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు చంద్రన్న డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మె నిర్వహిస్తున్న పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు మద్దతు తెలిపారు.

◆ **ఈవీఎంలపై అవగాహన**

కల్హేర్(నారాయణఖేడ్): ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన ఉండాలని కల్హేర్ డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ ఉమర్‌పాషా సూచించారు. గురువారం మండలంలోని కృష్ణాపూర్, ఇందిరానగర్, బీబీపేట, ఫత్తేపూర్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రమోద్, సర్పంచ్ కిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

సంగారెడ్డి అర్బన్: ఈనెల 4, 5వ తేదీలో ఈఎంఆర్ఐ సంస్థలో డ్రైవర్ ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌ను వెంట తీసుకుని ఇంటర్వ్యూకి హాజరుకావాలని సూచించరారు. వివరాలకు 9502573780 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

◆ **చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి**

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. జీహెచ్ఎంసీ క్రీడా విభాగం ద్వారా వచ్చిన క్రీడా పరికరాలను డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు గురువారం అందజేశారు.

◆ **పేదల వెన్నంటే ప్రభుత్వం**

పటాన్‌చెరు: నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా బీఎస్ ప్రభుత్వం పని చేస్తుందని పటాన్‌చెరు ఎంపీపీ సుష్మ శ్రీ., జెడ్పీటీసీ సుప్రజ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి అందజేశారు.